మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
సోమవారం | 22 | జూన్ | 2026 | పేజీలు : 08

# ఆరోగ్యాంధ్ర సాధిద్దాం : వంగలపూడి అనిత


2వ పేజీలో

**బీచ్‌రోడ్డు , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్క రించుకుని ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాలొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు 15 రోజులపాటు యోగా పక్షోత్సవాలు నిర్వహించామన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని ప్రభుత్వ శాఖలు, పోలీసు విభాగం సమన్వయంతో యోగా కార్యక్ర మాలను విస్తృతంగా నిర్వహించినట్టు తెలిపారు. పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, గ్రామాల్లో యోగా నిర్వహించి ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశామన్నారు. ఒత్తిడితో కూడిన జీవన శైలిలో యోగా, ధ్యానం అత్యంత అవసరమన్నారు. చిన్నారుల్లో పెరుగుతున్న డిప్రెషన్, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలకపాత్ర పోషిస్తుందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉత్తమ సాధనంగా పేర్కొన్నారు. కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ నెల రోజులుగా జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డిఫెన్స్ అండ్ ఎక్స్ సర్వీస్‌మెన్

## యోగాతో మానసిక ప్రశాంతత : కలెక్టర్ విజయకృష్ణన్



**అనకాపల్లి , జూన్ 21 ( మనం న్యూస్ ) :** యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బొజ్జన్నకొండ వద్ద నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత అందరితో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, యోగాతో మానసిక ప్రశాంతత, ఒత్తిడి లేని జీవితం సాధ్యమవుతుందన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు శారీరక శ్రమ బాగా తగ్గిందని, అధునాతనమైన సౌకర్యాలు అందుబాటులోకి రావడమే ఇందుకు కారణమని అన్నారు. శారీరక శ్రమ తగ్గడంతోపాటు మరోవైపు మానసిక ఒత్తిడి విపరీతంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. యాంత్రిక జీవన విధానంలో పరుగులు పెడుతున్నప్పటికీ ప్రతిరోజు కనీసం ఒక అరగంట సమయం యోగా సాధన కోసం కేటాయించాలని సూచించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, పాఠశాలల్లో యోగాను విధిగా అమలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించనున్నామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు యోగా సాధన చేసేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం

## ప్రశాంతంగా రీ-నీట్ (యూజీ) -2026 పరీక్ష

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి**


2వ పేజీలో

**విశాఖపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** జిల్లాలో నిర్వహించిన రీ - నీట్ (యూజీ)-2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ,104

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా


2వ పేజీలో

**గాజువాక , జూన్ 21 ( మనం న్యూస్ ) :** గాజువాక నియోజవర్గంలో తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు గాజువాక శాసన సభ్యులు ఆంధ్రప్రదేశ్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ద్వారా ముఖ్య మంత్రి సహాయ నిధికి

# ఆరోగ్యాంధ్ర సాధిద్దాం : వంగలపూడి అనిత

**ఒకటి తరువాయి**

థీమ్‌తో నేవీ సహకారంతో ప్రత్యేక యోగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్, వైట్ ఫ్లాగ్ బీచ్, ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, డీఎఫ్‌వో మేరీ ప్రశాంతి, ఇతర అధికారులు, యోగా అసోసియేషన్, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి యోగా పోటీల్లో విజేతలకు, విశిష్ట సేవలు అందించిన యోగా గురువులకు అతిథులు సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం ఏయూ విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

# యోగాతో మానసిక ప్రశాంతత : కలెక్టర్ విజయకృష్ణన్

**ఒకటి తరువాయి**

యోగాసనాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పలు శాఖల అధికారులు, యోగా సాధకులు పాల్గొన్నారు. యోగా వేడుకలను జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, క్రీడా మైదానాల్లో ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో భారత స్వాభిమాన్ ట్రస్టు యోగా గురువు భీశెట్టి దొరమ్మనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో పలువురు పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి వివరించారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ కె.రామకృష్ణ, యోగా గురువు కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. అనకాపల్లి కోర్టు సముదాయంలో నిర్వహించిన యోగా వేడుకల్లో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా

**ఒకటి తరువాయి**

దరఖాస్తు చేసుకున్న సుమారు 24 మంది లబ్ధిదారులకు ఆదివారం గాజువాక పార్టీ కార్యాలయంలో 36 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం అసమర్థత విధానాల వలన ఆర్థిక ఇబ్బందులు ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి మరియు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతలిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో గాజువాక నియోజవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్.. 72వ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అక్కిని లక్ష్మణరావు. 66వ వార్డ్ అధ్యక్షులు గోమడ వాసు. 74వ అధ్యక్షులు వియ్యపు కొండబాబు. 73వ వార్డ్ క్లస్టర్ ఇంచార్జ్ నాయుడు గాజువాక మైనార్టీ సెల్ అధ్యక్షులు రహిమాన్.. స్టీల్ టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి నమి సింహాద్రి. 75 వార్డ్ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ వియ్యపు అప్పలరాజు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు నాయకులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా రీ-నీట్ (యూజీ) -2026 పరీక్ష

**ఒకటి తరువాయి**

ఏరియా కేంద్రీయ విద్యాలయ-2లోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు. అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణ విధానాన్ని పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్ర నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

**91.05 శాతం హాజరు నమోదు...**

జిల్లాలో మొత్తం 8,015 మంది అభ్యర్థులు నీట్ పరీక్షకు నమోదు చేసుకోగా, వారిలో 7,298 మంది హాజరయ్యారు. జిల్లాలో 18 కేంద్రాల్లో ఆదివారం పరీక్ష జరగ్గా మొత్తం హాజరు 91.05 శాతం నమోదైంది. 717 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు, గైర్హాజరు శాతం 8.95 శాతంగా నమోదైంది. 1,761 మంది పురుష అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 1,619 మంది హాజరై, 141 మంది గైర్హాజరయ్యారు. అలాగే 6,254 మంది మహిళా అభ్యర్థులు నమోదు చేసుకోగా, 5,679 మంది హాజరై, 576 మంది గైర్హాజరయ్యారు.

# నిఘా నీడలో

# నీట్..ప్రశాంతంగా ముగిసిన పరీక్ష

**విశాఖపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** వైద్య విద్యలో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. గత నెల మూడోతేదీన నిర్వహించిన పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడంతో రద్దుచేయగా, ఆదివారం నాటి పరీక్షకు ఎలాంటి అవాంతరాలు, అవకతవకలు ఎదురవకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని మొత్తం 18 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. మెజిస్ట్రీరియల్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. ప్రశ్న పత్రాలను జీపీఎస్ సదుపాయం ఉన్న వాహనాల్లో కేంద్రాలకు తరలించారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. గతంలో అభ్యర్థులను పోలీసులు తనిఖీ చేసేవారు. కానీ ఈ సారి పోలీసులు బందోబస్తు నిర్వహించగా, అభ్యర్థులను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా బౌన్సర్లను నియమించారు.




బాలికలను తనిఖీ చేయడానికి మహిళా బౌన్సర్ల సేవలు వినియోగించారు. పరీక్ష రాసేందుకు వచ్చిన బాలికల జడలు విప్పి, జుత్తు విరబూసుకుని లోపలకి వెళ్లాలని సూచించారు. జడకు ఉండే క్లిప్పులు కూడా తొలగించారు. చెవి దుద్దులు, మెడలో గొలుసులు, చేతి గాజులు తీసివేసిన తరువాతే కేంద్రాల్లోకి అనుమతించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో ట్రాన్స్‌పరెంట్‌గా ఉండే వాటర్‌బాటిల్‌ను అభ్యర్థులు కేంద్రాల్లోకి తీసుకురావచ్చునని ఎన్‌టీఏ సూచించింది. అయితే ఏయూలోని మూడు కేంద్రాల్లో ఒక చోట పోలీసులు వాటిని కూడా అనుమతించలేదు. అభ్యర్థులకు తోడుగా తల్లిదండ్రులు, బంధువులు ఉదయం పదిగంటలకే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. చిరుజల్లులు కురవడం, ఆకాశం మేఘావృతంగా ఉండడంతో ఇబ్బందులు ఎదురుకాలేదు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత కేంద్రాల గేట్లు మూసివేశారు. దాదాపుగా అభ్యర్థులంతా నిర్ణీత సమయానికే కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం రెండుగంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఏయూ, కేంద్రీయ విద్యాలయం-2 కేంద్రాలను తనిఖీచేసి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. మొత్తం 18 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 8,105 మంది హాజరుకావాల్సి ఉండగా 7,298 మంది (91.05 శాతం) హాజరయ్యారు. వీరిలో బాలురు 1,761 మందికి 1,619, బాలికలు 6,254 మందికిగాను 5,679 మంది హాజరయ్యారు. బాలురు 141 మంది, బాలికలు 576 మంది మొత్తం 717 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ తెలిపారు. సహకరించిన అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రాల నిర్వాహకులను అభినందించారు.

# నరసింహ స్వామి వారి

# ఆలయంలో వైభవంగా తిరునక్షత్ర పూజలు

**సింహాచలం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం తిరునక్షత్ర పూజలు అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని ఆలయ స్థానాచార్యులు డి.పి. రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు మరియు వేద పండితులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపారు. వేద మంత్రోచ్చార



ణలు, భగవంతుని నామస్మరణతో ఆలయ ప్రాంగణం పులకించిపోయింది. స్వామి వారి తిరునక్షత్ర వేడుకల్లో భాగంగా శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలలో భక్తులు పాల్గొని, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

# అద్భుతమైన జీవన విధానం యోగా




**భీమునిపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు అని అది శరీరం, మనస్సు మరియు ఆత్మలను ఏకం చేసే ఒక అద్భుతమైన జీవన విధానం అని జెడ్పిటిసి గాడు వెంకటప్పడు అన్నారు. భీమిలి యోగా కేంద్రంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భీమిలి యోగా కేంద్రం గురువు వెంకటరమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. యోగా ప్రత్యేకతను తెలియజేస్తూ ?కర్మయోగ ప్రతిఫలాన్ని ఆశించకుండా చేసే సత్కర్మల మార్గం ?భగవంతునిపై సంపూర్ణ ప్రేమ, శరణాగతితో కూడిన భక్తి మార్గం, వివేకం, జ్ఞానం మరియు ఆత్మపరిశోధన ద్వారా ముక్తిని పొందే మార్గం అని తెలిపారు. ?అవయవాల పనితీరు గుండె, ఊపిరితిత్తులు మరియు జీర్ణవ్యవస్థ మెరుగవుతాయని, మానసిక ప్రశాంతత ఒత్తిడి ఆందోళన దూరం అవుతాయన్నారు.

ప్రతి మనిషి రోజుకు కనీసం 15 నుండి 30 నిమిషాలు యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్య కరమైన, ఆనం దకరమైన జీవితాన్ని గడపవచ్చు అని జడ్పీటీసీ వెంకట ప్పడు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి యోగా కేంద్రం గురువుగారు వెంకటరమణ, భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, రంగూరి రాంబాబు యోగా మాస్టర్లు డొకర సత్యన్నారాయణ, అప్పల నాయుడు, గాడు మురళి మాస్టర్ సింగనబంధ మాజీ సర్పంచ్ గాడు వెంకట నారాయణ, లక్ష్మీపురం శ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మ కర్త గాడు తాతినాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ గాడు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుతాఘాతంతో ఆరేళ్ల బాలుడు మృతి

**మధురవాడ / భీమునిపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ఇంటి ముందు క్రికెట్ ఆడుకుంటూ, ప్రమాదవశాత్తూ భూగర్భ ఎర్త్ వైర్ కరెంట్ తీగ తగలడంతో ఆరేళ్ల బాలుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాద ఘటన ఆదివారం ఉదయం కొమ్మాది, సాయిరాం కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లా బి.సంతకవిటి మండలం ఉప్పన్నదావలస గ్రామానికి చెందిన కురిటి నారాయణరావు (అపార్ట్మెంట్ వాచ్‌మన్), చిన్న మ్మడు దంపతులు గత పదేళ్లుగా మధురవాడలో నివాసం ఉంటున్నారు. వీరి ఆరు సంవత్సరాల కుమారుడు కురిటి అఖిల్ ఆదివారం ఉదయం



రోడ్డుపై క్రికెట్ ఆడుతూ కింద పడిన బంతిని తీసే క్రమంలో ప్రమాదవశాత్తూ భూగర్భ ఎర్త్ విద్యుత్ తీగకు గుర్తై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ చిన్నారి బలి అయ్యాడని, నిండు ప్రాణం పోయిందని బాలుడి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

# ముస్లిం వివాహ వేదికకు విశేష స్పందన




**విశాఖపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** జీవీఎంసీ 42 వ వార్డు టి ఎస్ ఎన్ కాలనిలో హోటల్ సింకా గ్రాండ్ లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 13 వ పర్యాయంగా ఆదివారం ముస్లిం వివాహ పరిచయ వేదిక నిర్వహించారు.ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాపతంగా పలువురు ముస్లింలు పాల్గొని వారి అర్హతలను బట్టి వారి తమ పిల్లలకు పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్నారు.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదరాలి సింకా మాట్లాడుతుతమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 13 సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలు, ఏర్పాటు చేశామని,ఇంత వరకు 300 వివాహాలు చేసుకొని ఒక్కటయ్యారని తెలిపారు.సుమారు 200 యువతి యువకులు వారి తల్లి తండ్రులు ఈ రోజు జరిగిన వివాహ పరిచయ వేదికలో పాల్గొన్నారన్నారు .ఇది పూర్తిగా ఉచిత సేవ అని, వివాహ వేదికకు ఈ హోటల్ ను కుడా ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికిమధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామని,పేద ముస్లిం లకు తమ సొసైటీ తరపున షాదీ ఖర్చులు భరించి వివాహాలు జరిపిస్తున్నామని సింకా ఈ సందర్భంగా తెలిపారు.ఈ ఉచిత వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన వస్తోందన్నారు.కార్యక్రమం లో సొసైటీ గౌరవ అధ్యక్షుడు మునీర్ ఖాన్ బాబా, హాజీ షేక్ మునీర్,వైస్ ప్రెసిడెంట్ హాజీ మీర్ అబ్బాస్ హుసేన్,కార్యదర్శి సయ్యద్ అమీర్ జాన్,జాయింట్ సెక్రటరీ మహబూబ్ అలీఖాన్, కోశాదికారి షేక్ అహమ్మద్ వలి, అడ్వకేట్ ఎం ఎ రజాక్,కమిటీ సభ్యులు అబ్దుల్ మునీర్ ముషాద్,హాజీ రెహమతుల్లా, మహబూబ్ షరీఫ్, మహమ్మద్ లక్మాన్, అస్గర్ అలి, మహమ్మద్ అస్లం తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

# పెందుర్తిలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



**పెందుర్తి , జూన్ 21 ( మనం న్యూస్ ) :** పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు, పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సతీష్ కుమార్ మార్గదర్శకత్వంలో, సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.కె జిలాని కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారికి, మంచి ఆలోచనలతో సమాజంలో సజ్జనులుగా మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరి నడవడికను పోలీసులు తరచూ గమనిస్తారని, ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.అలాగే, వారి ప్రవర్తన కుటుంబాలపై, సమాజంపై ప్రతిబింబిస్తుందని గుర్తు చేశారు. కుటుంబ సభ్యుల గౌరవం, సమాజంలో మంచి పేరు పొందాలంటే, సన్మార్గంలో నడవడం మాత్రమే మార్గమని తెలియజేశారు.పోలీసులు వారికి మంచి జీవన శైలి, క్రమశిక్షణతో కూడిన నడవడిక, సమాజానికి ఉపయుక్తంగా ఉండే పనులు చేయాలని ప్రోత్సహించారు. సమాజ శాంతి, భద్రత కోసం అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## 5.6 కోట్లు విలువగల 1200 కేజీల గంజాయి స్వాధీనం..ముగ్గురి అరెస్ట్



**ముంచింగిపుట్టు , జూన్ 21 ( మనం న్యూస్ ) :** అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిండితులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపిస్తామని విశాఖపట్నం ఇంటెలిజెంట్ ఇన్స్పెక్టర్ కే, కిరణ్ బాబు తెలిపారు. స్థానిక ఎస్సై నాని, సమక్షంలో ఇంటెలిజెంట్ ఇన్స్పెక్టర్ కిరణ్ బాబు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి,పక్క సమాచారంతో. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండలంలోని బూసిపుట్టు పంచాయితీ, గ్రామ సమీపంలో ఆదివారం వాహనా తనిఖీలు నిర్వహిస్తుండగా.. బొలెరో వాహనంపై తరలిస్తున్న 1200 కిలోల గంజాయి పట్టుబడిందని పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో ఒకరు ఒడిశాకు చెందిన మరో ఇద్దరు అల్లూరి జిల్లా ముంచింగి పుట్టు మండల వాసులుగా గుర్తించా మని తెలిపారు. పట్టుబ డిన గంజాయి విలువ రూ.5.6 కోట్లు ఉందన్నారు. నిందితుల నుంచి సెల్ ఫోన్లు బొలెరో పికప్ స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

# ఘనంగా యోగా దినోత్సవం..!!

**ఆనందపురం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ పరిధిలోని నేలతేరు గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు ఆచరించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ మాట్లాడుతూ యోగా ఆరోగ్యవంతమైన జీవనశైలికి పునాది వంటిదని, ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని యోగా ప్రాముఖ్యతపై అవగాహన పొందారు. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక సమతుల్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు వివరించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# యోగాతో ఆరోగ్యం, ఆనందం

## ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



**ముంచంగి పుట్టు , జూన్ 21 ( మనం న్యూస్ ) :** నేటి ఉరుకులు పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడిని దూరం చేసి శరీరాన్ని దృఢంగా ఉంచే ఒక అద్భుత సాధనం యోగ అని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు క్రీడా మైదానంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర హాజరయ్యారు. 108 సూర్య నమస్కారాలతో కూడిన ఆసనాలు వేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. యోగ కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదని అది మన మనసును, శరీరాన్ని ప్రకృతితో అనుసంధానం చేయు ఒక జీవన విధానం అన్నారు. యోగ అనేది మనల్ని మనం మార్చుకోవడానికి చేసే కొత్త ప్రయాణంగా అభివర్ణించారు. మనల్ని మనం తెలుసుకోవడానికి చేసే అంతర్గత ప్రయాణం అని శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత , ఆత్మకు నిశ్శబ్దం ప్రసాదించే ఏకైక ఔషధం యోగాసనం అన్నారు. యోగ అన్ని మతాల కంటే పురాతనమైనదని మతం అనే ఆలోచన మనిషి మనసులో లేక ముందే యోగ అనేది మన జీవన విధానంలో ఒక భాగం అయి ఉండేది అన్నారు. మనమే దానికి దూరంగా ఉండటం వల్ల వివిధ వ్యాధులకు గురై మన ఆయుష్ ను తగ్గించుకుంటున్నామన్నారు. ఒకరకంగా మనం చేసే అన్ని సాధనాలు ఉద్దేశము మీ శక్తి , ఎరుక, అస్తిత్వాలను పెంచడమేనని తెలిపారు.

గతాన్ని మనం మార్చలేము... కానీ దాన్ని దూరం చేసే సంప్రదాయ పరిష్కార మార్గం యోగా అన్నారు. యోగ సరిగ్గా చేస్తే ప్రతి ఆసనం ఒక శక్తి ప్రక్రియననే తెలిపారు. యోగ అంటే మన ప్రాధాన్యతలు శరీరం మనసు బాగా భావోద్వేగాల నుండి జీవం దిశగా మార్చడం భ్రమల నుంచి వాస్తవానికి మారడం అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, జోలపుట్టు ఎంపీటీసీ కమల, పెదపాడు ఎంపిటిసి గణపతి, బరడ ఎంపిటిసి నబ్బో , లక్ష్మీపురం ఎంపీటీసీ సాధురామ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వివిధ పంచాయతీల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు, ప్రజలు , యోగ ప్రేమికులు, అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతంలో రక్తం కొరత అనే మాట వినపడకూడదు

## రక్తదాన కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర



**ముంచంగి పుట్టు , జూన్ 21 ( మనం న్యూస్ ) :** భవిష్యత్తులో గిరిజన ప్రాంతంలో రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోయారన్న మాట వినిపించకూడదని ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర పిలుపునిచ్చారు. రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ముంచంగిపుట్టు ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఆమె స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రక్తం దొరకక అనేక మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలతో స్వయంగా చూశానన్నారు. రక్తదానంపై అవగాహన లేక ఈ సమస్య ఉత్పన్నమైందని భవిష్యత్తులో ఇటువంటి మాట వినిపించకూడదన్నారు. రక్తదానంపై గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్యం తీసుకురావాలన్నారు. సికిల్ సెల్ అనేమియాతో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉందని వారికి నిరంతరం రక్తమార్పిడి అవసరమని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఆ సమస్యతో బాధపడుతున్న వారి కోసమైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రక్తదానంపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఈరోజు భారీ సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. రక్తదానంపై పార్టీ శ్రేణులలో ఏర్పడిన ఈ అవగాహన ప్రజల్లో కూడా తీసుకొచ్చేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. ఇంత భారీ ఎత్తున రక్తదాన శిబిరానికి పార్టీ నాయకులు వస్తారని ఊహించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, జోలపుట్టు ఎంపీటీసీ కమల, పెదపాడు ఎంపిటిసి గణపతి, బరడ ఎంపిటిసి నబ్బో , లక్ష్మీపురం ఎంపీటీసీ సాధురామ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వివిధ పంచాయతీల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు, ప్రజలు , అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ తో భవిష్యత్ అంధకారం

## ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర



**ముంచంగి పుట్టు , జూన్ 21 ( మనం న్యూస్ ) :** డ్రగ్స్ మహమ్మారి మనకు భవిష్యత్తు లేకుండా చేస్తుందని దానికి మన పిల్లలను దూరంగా ఉంచే బాధ్యత మనదేనని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు లో ఆదివారం నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీ ముగింపు కార్యక్రమంలో సుభద్ర మాట్లాడారు. ఇప్పుడున్న పిల్లలు డ్రగ్స్ వినియోగం చూస్తుంటే భవిష్యత్ అంధకారంలోకి పోతుందనే భయాందోళనలు కలుగుతున్నాయి అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా డ్రగ్స్ కు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు పేర్కొన్నారు. ఇది పాత తరం కొత్త తరం భవిష్యత్ తరం అని తేడా లేకుండా అందరినీ కాలకూట విషయంలా చంపేస్తుందన్నారు. దీనిని అరికట్టడంలో మనం చొరవ చూపకపోతే మనకి భవిష్యత్తు ఉండదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసులు ప్రభుత్వం బాధ్యత వహిస్తే చాలు అనుకుంటే పొరపాటని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకున్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. యూనివర్సిటీ నుంచి కాలేజీకి కాలేజీ నుంచి ఎప్పుడు స్కూల్లకు కూడా పాకిందని ఈ పరిస్థితి చూస్తుంటే భవిష్యత్తు ఏమవుతుందని ఆందోళన తనకు వ్యక్తమవుతుందన్నారు అందుకే ప్రతి ఒక్కరు తమ పిల్లల్ని డ్రగ్స్ కు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, జోలపుట్టు ఎంపీటీసీ కమల, పెదపాడు ఎంపిటిసి గణపతి, బరడ ఎంపిటిసి నబ్బో , లక్ష్మీపురం ఎంపీటీసీ సాధురామ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వివిధ పంచాయతీల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు, ప్రజలు , యోగ ప్రేమికులు, అధికారులు పాల్గొన్నారు.

# మంచాల కార్యదర్శి ఎవరు!??

- వెలగని వీధి దీపాలు..??
- మొరాయించిన పారిశుధ్యం!??
- ఎవరికి చెప్పాలో తెలియడం లేదు!??

**అనకాపల్లి / చీడికాడ , జూన్ 21 ( మనం న్యూస్ ) :** పంచాయతీ పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన పంచాయతీ కార్యదర్శి గత నెల 26 నుండి కనిపించడం లేదని గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత పాటూరి రమణ, ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ గ్రామంలో వీధిలైట్లు వెలగక అంధకారంలో మగ్గుతుందని గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి చెప్పేందుకు వెళ్లిన కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అసలు పంచాయతీ కార్యదర్శి ఉన్నారా లేరా అన్నది కూడా తెలియడం లేదని దీంతో గ్రామస్తులు ఎవరికి చెప్పుకోవాలో అంత చిక్కడం లేదన్నారు. గ్రామంలో అపరిశుధ్యం తాండవిస్తుందని ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సచ్చ దివాస్. అంటూ గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రకటనలు చేస్తుంటే తమ గ్రామం మాత్రం చెత్తాచెదారంతో, డ్రైనేజీలు పూడుకుపోయి. దుర్గంధం వెదజల్లుతూ దర్శనమిస్తున్నాయన్నారు. గ్రామంలో డ్రైనేజీలు అధిక శాతం లేకపోవడంతో వాడిన నీరు రోడ్లపై పారుతుందని, ఉన్న కొన్ని డ్రైనేజీలు మురికినీటితో నిండిపోయి దర్శనమిస్తున్నాయన్నారు. ఈ సమస్యపై మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించిన ఫలితం కనిపించలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇటీవల ఓటర్ల జాబితా సరి చేసేందుకు ప్రభుత్వం నియమించిన బిఎల్వోలు ఎవరో కూడా తెలియలేదని, వాటర్ లా జాబితా కోసం అందజేస్తున్న పత్రాలు తమ గ్రామంలో ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వలేదని ఇలా అయితే తమ గ్రామం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ప్రశ్నించారు. సమస్యల కొలిమిలో తమ గ్రామం కొట్టుమిట్టాడుతుందని అధికారులకు తెలిపిన స్పందించడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేకుంటే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# ప్రజాదరణ కోల్పోతున్న పల్లె వెలుగు బస్సు..!!

- పల్లె ప్రజలకు అందని సౌకర్యం
- ఆర్టీసీ నిర్లక్ష్య ధోరణి
- పల్లె వెలుగుకు సార్థకత ఏది?
- పలువురు సూటి ప్రశ్న




**ఆనందపురం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ఒకప్పుడు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉండే పల్లె వెలుగు బస్సులు నేడు ప్రజాదరణ కోల్పోతున్నాయి. ఎందుకంటే హైవే రోడ్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసే సర్వీస్ అప్రోచ్ మార్గాల గుండా వెళ్లకుండా హైవే పైన ప్రయాణిస్తుండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట ఉత్పత్తులను పట్టణాలకు తరలించే క్రమంలో నానా అగచాట్లు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఆటోలు వంటి వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. పల్లె వెలుగు అనే పదానికి సార్థకత లేకుండా పోయింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. సర్వీస్ అప్రోచ్ రోడ్ల మీదగా వెళ్లి ఉంటే చాలామందికి ఉపయోగకరంగా ఉంటుందనేది వాదన. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని క్రింది విధంగా పంచుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానంలో పల్లె వెలుగు బస్సు సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఉప్పాడ అప్పారావు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు, రైతులు, కూలీలు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు నిత్య ప్రయాణాల కోసం ప్రధానంగా పల్లె వెలుగు బస్సులపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అవకాశాలను చేరువ చేయడంలో పల్లె వెలుగు సేవలు ఎంతో కీలకమైన వారధిగా నిలిచాయని అన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ సేవలు కాలానుగుణంగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం గ్రామాల జనాభా పెరగడం, విద్యార్థుల సంఖ్య అధికమవడం, ఉపాధి అవకాశాల కోసం ప్రజల రాకపోకలు పెరగడం వంటి కారణాలతో బస్సు సేవలపై ఒత్తిడి కూడా పెరిగిందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం, మరికొన్ని గ్రామాలకు అదనపు సర్వీసుల అవసరం కనిపించడం, విద్యార్థులు మరియు ఉద్యోగుల ప్రయాణ అవసరాలు పెరగడం వంటి అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రామీణ ప్రజల అభిప్రాయాలను సేకరించి, వాటి ఆధారంగా మార్గాలు, సర్వీసులు, సమయాల్లో అవసరమైన మార్పులు చేస్తే సేవలు మరింత సమర్థవంతంగా మారుతాయని అభిప్రాయపడ్డారు. పల్లె వెలుగు బస్సు అనేది కేవలం ఒక రవాణా సేవ మాత్రమే కాదని, అది గ్రామీణ ప్రజల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, విద్యా అవకాశాలు, వైద్య సేవలకు అనుసంధానంగా నిలిచే ముఖ్యమైన వ్యవస్థ అని ఉప్పాడ అప్పారావు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రవాణా వ్యవస్థ కీలకమైన పాత్ర పోషిస్తుందని, అందువల్ల పల్లె వెలుగు సేవలను మరింత ప్రజలకు చేరువ చేసే దిశగా చర్యలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తే పల్లె వెలుగు సేవలు మరింత ప్రజాదరణ పొందడంతో పాటు గ్రామాభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తాయని ఉప్పాడ అప్పారావు అభిప్రాయపడ్డారు .

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం - మానసిక ప్రశాంతత

## మండల టిడిపి అధ్యక్షురాలు సన్యాసమ్మ సంధ్య

**ముంచంగి పుట్టు , జూన్ 21 ( మనం న్యూస్ ) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముంచంగిపుట్టు మండలం హోలీ గ్రౌండ్ లో, జరిగిన యోగా కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు, మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు గ్రహీత కిల్లో సన్యాసమ్మ సంధ్య పాల్గొని యోగా సనాలు వేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా మన పురాతన సంస్కృతి అని, దీన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. బిజీ జీవితంలో ఒత్తిడిని జయించడానికి యోగా అద్భుతమైన మార్గమని వారు అభిప్రాయపడ్డారు. నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుందని, ఆరోగ్యాంధ్ర కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యానికి సంబంధించినది. ప్రభుత్వాలు దీనిని ఒక ఆరోగ్యకరమైన అలవాటుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంత అవసరమో, రాజకీయాలకు అతీతంగా



అందరూ యోగాలో భాగస్వామ్యమైనప్పుడే దీనికి సంపూర్ణ సార్థకత లభిస్తుందని, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ముందుండి నడపడం వల్లే యోగా గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ఒక ప్రజా ఉద్యమంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు. ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కేథరిన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఆర్.డి. రత్న రాజు కన్నుమూత



**భీమునిపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ మాజీ ప్రిన్సిపాల్, ఏయూ సెనేట్, సిండికేట్ మాజీ సభ్యుడు, కేథరిన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ సహ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఆర్.డి. రత్న రాజు ఆదివారం ఉదయం 10:30 గంటలకు తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహం సోమవారం ఉదయం 11 గంటల వరకు గిల్లల్ అపార్ట్‌మెంట్స్‌లో, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు పద్మనాభం స్ప్రింగ్‌ఫీల్డ్ స్కూల్ క్యాంపస్ క్యాంప్ డేవిడ్‌లో, సాయంత్రం 3 నుంచి 4:30 గంటల వరకు భీమిలి కేథరిన్ క్యాంపస్‌లో ఉంచుతారు. అంత్యక్రియలు సోమవారం సాయంత్రం 5 గంటలకు భీమిలి కేథరిన్ క్యాంపస్‌లో జరుగుతాయని ఆయన కుమారుడు ఆలీవర్ రాయి తెలిపారు.

## దారి మళ్లిన మూడు ఇండిగో విమానాలు

**విశాఖపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** విశాఖకు రావాల్సిన మూడు ఇండిగో విమానాలు శంషాబాద్ కు దారి మళ్ళించారు. విశాఖలో ప్రతికూల వాతావరణం కారణంగా విమానాల దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

తక్కువ విజిబులిటీ, ల్యాండింగ్ అనుమతి లేక విమానాల దారి మళ్లించక తప్పలేదు.ముంబై, బెంగళూరు, హైదరాబాదు నుంచి రావాల్సిన విమానాలు దారి మళ్లించారు. శంషాబాద్ విమానా శ్రయం లో విమానాలు సురక్షితంగా ల్యాండ్ అవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## రోడ్డు ప్రమాదం యువకుడు మృతి

**గాజువాక , జూన్ 21 ( మనం న్యూస్ ) :** విశాఖ జిల్లాలోని గాజువాక ప్రాంతంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. బీహెచ్పీవీ ఆటోనగర్ ఎంఎస్ఎంఈ కార్యాలయం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో 18 సంవత్సరాల యువకుడు మృతి చెందాడు. సంఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కర్తవ్య నిర్వహణలో ప్రాణాలకు తెగించిన బీఎస్ఎన్ఎల్ సిబ్బంది..కూనవరం లో తేనెటీగల దాడి

**కునవరం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ప్రజలకు అంతరాయం లేని కమ్యూనికేషన్ సేవలు అందించడమే లక్ష్యంగా, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తూ చింతూరు డివిజన్ బి ఎస్ ఎన్ ఎల్ -పేస్ టీం తమ నిబద్ధతను చాటుకుంది. విధి నిర్వహణలో భాగంగా ఎదురైన ఊహించని ప్రమాదం నుండి తృటిలో తప్పించుకుని, ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

**సమస్య పరిష్కారానికి వెళ్లి.. ప్రమాదంలో చిక్కుకుని..**

చింతూరు విభాగ పరిధిలోని కునవరం దూరదర్శన స్తంభంలో సంకేతాల (సిగ్నల్) సమస్య తలెత్తింది. ఆ సమాచార వ్యవస్థను పునరుద్ధరించేందుకు బి.ఎస్.ఎన్.ఎల్ నిర్వహణ ఇంజనీర్ యర్రం కాశి, స్తంభం ఎక్కే కార్మికుడు నాగేశ్వరరావు, సాంకేతిక నిపుణుడు రాము కలిసి కునవరం స్తంభం వద్దకు చేరుకున్నారు. సాంకేతిక లోపాన్ని సరిచేసేందుకు వారు పైకి ఎక్కుతుండగా, అక్కడ ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వారిపై ఉధృతంగా దాడి చేశాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, తోటి సిబ్బంది వెంటనే స్పందించి గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం కూనవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు వారికి అత్యవసర వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని, ఆరోగ్యం స్థిరంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం వారిని ఇంటికి పంపించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి.

**యర్రం కాశి బృందంపై ప్రజల ప్రశంసల జల్లు**

సమాచార వ్యవస్థను కాపాడటానికి గిరిజన ప్రాంతాల వంటి మారుమూల ప్రదేశాలలో కూడా





ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న ఇంజనీర్ యర్రం కాశి మరియు వారి బృందం యొక్క సేవా నిరతిని, శ్రమను స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కొనియాడారు. కష్టసమయాల్లోనూ వెనకడుగు వేయకుండా విధులు నిర్వహించే ఇలాంటి ఉద్యోగుల పనితీరు నిజంగా అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

**పద్మనాభం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** మండలంలోని పద్మనాభం గ్రామంలో 30వ పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించారు. పద్మనాభం గ్రామ బాధ్యులు, భీమిలి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, విశాఖపట్నం జిల్లా నాగవంశం సంక్షేమ సంఘం కార్యదర్శి కంటుబోతు సుమంత్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారితో కలిసి ఓటర్లకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించి, గృహ గణన దరఖాస్తుల నమోదును చేపట్టారు. ఓటర్లు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా సహకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, పద్మనాభం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామసింగు సన్యాసిరావు, జనసేన నాయకుడు బుగత రాము, భారతీయ జనతా పార్టీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు హంస మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# యోగా తో ఆరోగ్యం ఎమ్మెల్యే ఎన్ఈఆర్

**లావేరు , జూన్ 21 ( మనం న్యూస్ ) :** ప్రతి ఒక్కరు యోగా చేస్తేనే ఆరోగ్యంగా ఉంటామని స్థానిక ఎచ్చర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు ఆదివారం నాడు అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థులతో పాల్గొని యోగ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనము ప్రస్తుతం తినే పదార్థాలకు అనుగుణంగా యోగ చేయకపోతే అనారోగ్య పాలవుతామని తెలిపారు ప్రతి ఒక్కరూ ప్రతి దినము ఉదయం సాయంత్రం యోగ చేస్తే ప్రతిరోజు ఆరోగ్యం మంచిగా ఉంటుందని తెలిపారు ప్రతి మనిషి యోగా చేయడం వలన ఆసుపత్రి ఖర్చులు తగ్గి ఆరోగ్య పంతులుగా తయారవుతారని చెప్పారు యోగ దినోత్సవం ప్రపంచ



దేశాలకే పేరు తెచ్చే విధంగా మనదేశంలో యోగ నిర్వహించడానికి ముఖ్య కారకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# చినుకు పడితే విలయమే

విశాఖపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) : ఏకధాటిగా అరగంట వర్షంకురిసే సరికి నగరంలోని గెడ్డలన్నీ పొంగిపోయాయి. వాటి సామర్థ్యం సరిపోక వర్షంనీరు రోడ్ల పైనుంచి ప్రవహించడంతో పల్లపుప్రాంతాల్లోని ఇళ్లు నీటమునిగిపోయాయి.చావులమదుం, ఆరిలోవ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నుంచి వాహన రాకపోకలకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. అరగంట కురిసిన వర్షానికే నగరంలో పరిస్థితి ఇలామారిపోతే భారీవర్షాలు పడితే పరిస్థితి ఏమిటనేదానిపై సర్వత్రా ఆందోళన నెలకొంది. శరవేగంగా అభివృద్ధిచెందుతున్న విశాఖలో ప్రభుత్వభూములతోపాటు గెడ్డల ఆక్రమణలు పెరిగిపోయాయి. అవకాశం దొరికితే గెడ్డలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఒకప్పుడు విశాలంగా కనిపించిన గెడ్డలన్నీ ప్రస్తుతం చిన్న కాలువల్లా మారిపోయాయి. సాధారణ రోజుల్లో గెడ్డలు కుచించుకుపోవడం వల్ల ఇబ్బందులు తెలయకున్నా, మోస్తరు వర్షం కురిస్తే సమస్య కళ్లముందు సాక్షాత్కారమవుతోంది. నగర పరిధిలోని ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, దుకాణాల్లోని రోజువారీ వాడుక నీటిని బయటకు పంపించేందుకు అంతర్గతంగా 4,067 కిలోమీటర్ల పొడవున డ్రైనేజీలు నిర్మించారు. ఇవికాకుండా డ్రైనేజీల నుంచి కలిసేనీటితోపాటు వర్షం పడినపుడు వరద నీటిని బయటకు పంపించేందుకు 47 మేజర్‌గెడ్డలు దాదాపు 176.86 కిలోమీటర్ల పొడవున ఉన్నాయి. వీటిలో ప్రవహించే మురుగునీరు సమీపంలోని ట్రీట్‌మెంట్‌ప్లాంట్లకు చేరి శుద్ధిచేసిన తర్వాత సముద్రంలో కలిస్తే... మరికొన్నిగెడ్డలు నేరుగా సముద్రంలో కలిసిపోతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఉండే గెడ్డలన్నీ నేడు బక్కచిక్కిపోయాయి. గెడ్డల పరిరక్షణపై జీవీఎంసీ, రెవెన్యూ అధికారులకు చిత్తశుద్ధి లోపించడంతో ఎవరికివారే తమస్థలాలు/ఇళ్ల ముందున్న గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్నారు. దీనివల్ల మోస్తరు వర్షం కురిస్తే గెడ్డలన్నీ పొంగిపోతున్నాయి. శనివారం రాత్రి అరగంట వర్షానికి నగరం జలమయమైంది. శివాజీపాలెం, పీతలవానిపాలెం, ఆరిలోవ, చినగదిలి, ఎంవీపీకాలనీ, లాసన్స్‌బే కాలనీ, బీచ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో గెడ్డలన్నీ పొంగి రోడ్ల పైనుంచి వర్షం నీరు ప్రవహించింది. గెడ్డల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు రోడ్లు, పల్లపుప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరిపోయాయి. పారిశుధ్య సమస్య తలెత్తడంతో జీవీఎంసీ సిబ్బంది ఆదివారం సెలవైనా, రోజంతా కష్టపడాల్సి వచ్చింది. ఒక్కోసారి వరదనీటికి పురాతనభవనాల గోడలు నాని కూలిపోతున్నాయి. నగరంలో గెడ్డలను పరిరక్షించే బాధ్యత జీవీఎంసీతోపాటు రెవెన్యూశాఖ అధికారులపై ఉంటుంది. ఎవరైనా గెడ్డలకు సమీపంలో నిర్మాణాలు చేపడితే ఇరువైపులా పది మీటర్లు బఫర్‌జోన్‌ను మినహాయించి నిర్మాణాలు చేపట్టాలి. కానీ నగరంలో బఫర్‌జోన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా ఏకంగా గెడ్డలను కప్పేసి మరీ నిర్మిస్తున్నా జీవీఎంసీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

# 1/70 చట్టం రద్దు అయితే..గిరిజన సమాజ భవిష్యత్తు ప్రశ్నార్థకమే!

## భూమి, జీవనం, సంస్కృతి పరిరక్షణకు రక్షణ కవచం 1/70 చట్టం

పాచిపెంట , జూన్ 21 ( మనం న్యూస్ ) : గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల భూములను రక్షించేందుకు అమలులో ఉన్న 1/70 భూబదలాయింపు వ్యతిరేక చట్టం గిరిజనుల మనుగడకు కీలకమైన రక్షణ కవచంగా నిలుస్తోంది. ఈ చట్టం బలహీనపడినా లేదా రద్దయినా గిరిజన సమాజం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో తీవ్ర పరిణామాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని గిరిజన హక్కుల పరిరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.






**భూములపై గిరిజనేతరుల ఆధిపత్యం:**
చట్టం లేకుంటే ఆర్థికంగా బలమైన గిరిజనేతరులు గిరిజన భూములను సులభంగా స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో తరతరాలుగా సాగుచేసుకుంటూ జీవిస్తున్న గిరిజన కుటుంబాలు తమ సొంత భూముల నుంచే నిర్వాసితులై, అదే ప్రాంతాల్లో కూలీలుగా మారే పరిస్థితులు ఏర్పడవచ్చు.

**విద్య, ఉపాధిపై ప్రభావం:**
భూమిని కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిని పిల్లల చదువులు మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉంది. విద్యా అవకాశాలు తగ్గిపోవడంతో భవిష్యత్ తరాలు మరింత వెనుకబడిపోయే అవకాశం ఉంది. ఉపాధి, ఆదాయ వనరులు తగ్గిపోవడం వల్ల పేదరికం మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుంది.

**ఆరోగ్యం, ఆహార భద్రతకు ముప్పు:**
గిరిజనుల జీవనాధారం భూమి, అడవి వనరులే. భూములను కోల్పోతే ఆహార భద్రత దెబ్బతినడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉంది. జీవన ప్రమాణాలు క్షీణించి సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

**సంస్కృతి, అస్తిత్వానికి ప్రమాదం:**
గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భూమి, అడవులతో ముడిపడి ఉంటాయి. భూములు కోల్పోతే వారి సాంప్రదాయ జీవన విధానం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఫలితంగా గిరిజనుల ప్రత్యేక గుర్తింపు, అస్తిత్వం సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

**స్వయం ప్రతిపత్తిపై ప్రభావం:**
గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల ఆధిపత్యం పెరిగితే గ్రామాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది. స్థానిక ప్రజల నిర్ణయాధికారం తగ్గిపోతుంది. భవిష్యత్తులో గిరిజనులు తమ సొంత ప్రాంతాల్లోనే మైనారిటీలుగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదీ అని ఐటీడీఏస్ స్వచ్ఛంద సంస్థ, APSAAS స్వచ్ఛంద సంస్థ, మన్యం గిరిజన సేవా సంఘం మరియు ఆదివాసి సంక్షేమ పరిషత్ న్యాయపోరాటాలు చేస్తున్నారు.

# ఉచిత హోమియో మందులు పంపిణీ

భీమునిపట్నం , జూన్ 21 ( మనం న్యూస్ ) : స్థానిక డచ్ వీధిలో కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 94 వ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించినట్లు ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరాం తెలియచేసారు. తమ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన హోమియో వైద్య శిబిరం లో సుమారు 72 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు టి. జగన్నాధ రావు, టి జె మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు కె ఎస్ ఎన్ మూర్తి, కె చంద్ర శేఖర్, కే వి భానోజీరావు, కే.శ్రీనివాసరావు, చంద్ర శేఖర్ మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# స్వయంభూ విఘ్నేశ్వరాలయానికి పాలకమండలి నియామకం

చోడవరం , జూన్ 21 ( మనం న్యూస్ ) : స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయానికి 12 మంది సభ్యులతో నూతన పాలకమండలిని నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా మంగా శ్రీనివాసరావు, డి.లక్ష్మీ నరసింహారావు, యు.శ్రీనివాసరావు, డి.మోహన వెంకట జయసింహా, బి.వి.ఎస్. సంతోషికుమారి, ఎస్.లక్ష్మి, జె.మురళి, వై.వరలక్ష్మి, వెంకటలక్ష్మి, కె.ఈశ్వరరావు, ఎం.ఈశ్వరమ్మ, అర్చకుడు కె.వెంకటరావు (ఎక్స్ అఫిషియో) నియమితులయ్యారు. వీరిలో గౌరీపట్నం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు మంగా శ్రీనివాసరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారానికి ముందు చైర్మన్‌ను లాంఛనప్రాయంగా ఎన్నుకుంటారు. కాగా పాలకమండలి సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, జనసేన ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు, బీజేపీ నాయకుడు ఈర్లె శ్రీరామమూర్తిలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



# దేవస్థాన భూముల్లో నివసిస్తున్న అర్హులైన నివాసితులకు మరమ్మతుల అనుమతులు



**సింహాచలం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం పరిధిలోని పంచగ్రామాల్లో దేవస్థాన భూములపై చిరకాలంగా నివసిస్తున్న నివాసితుల గృహ భద్రతను దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు పాత ఇళ్లకు అవసరమైన స్వల్ప మరమ్మతులు (మైనర్ రిపేర్లు) చేపట్టుకునేందుకు దేవస్థానం అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు తెలిపారు. దేవస్థానం ఏర్పాటు చేసిన ల్యాండ్ గ్రీవెన్స్ సెల్‌కు దరఖాస్తు చేసుకున్న వారి అభ్యర్థనలను టెక్నికల్ టీమ్, నాన్–టెక్నికల్ టీమ్ ప్రత్యేక కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వారికి మాత్రమే మరమ్మతుల అనుమతులు మంజూరు చేయబడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పెందుర్తి మండలం, చీమలపల్లి గ్రామం, సర్వే నంబరు 45/2లో గల ఇంటి యజమాని బొట్టా నూకరాజు దాఖలు చేసిన దరఖాస్తును పరిశీలించిన అనంతరం, ప్రస్తుత నిర్మాణంలో ఎటువంటి విస్తరణలు లేదా మార్పులు చేయకుండా కేవలం గోడలు మరియు స్లాబ్‌కు సంబంధించిన స్వల్ప మరమ్మతులు మాత్రమే చేపట్టేందుకు దేవస్థానం అనుమతి మంజూరు చేసినట్లు కార్యనిర్వహణాధికారి వెల్లడించారు. దేవస్థానం అనుమతులు కేవలం మైనర్ రిపేర్లకే పరిమితమని, కొత్త నిర్మాణాలు, అదనపు గదులు, అంతస్తుల నిర్మాణం లేదా ఇతర శాశ్వత మార్పులకు ఎటువంటి అనుమతులు ఇవ్వబడవని స్పష్టం చేశా రు. అనుమతుల నిబంధనలనుఉల్లంఘిం చినట్ల యితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసు కోవడంతో పాటు అక్రమ నిర్మాణాలను తొలగిం చనున్నట్లు హెచ్చరించారు. పంచగ్రామాల ప్రజలు దేవస్థానం భూముల పరిరక్షణలో భాగస్వాములు కావాలని, నిబంధనలను పాటిస్తూ దేవస్థానానికి సహకరించాలని కార్యనిర్వహణాధి కారిజల్లేపల్లి వెంకటరావు విజ్ఞప్తి చేశారు





# గాజువాక క్రికెట్ అకాడమీలో ఘనంగా యోగా దినోత్సవం

**గాజువాక , జూన్ 21 ( మనం న్యూస్ ) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గాజువాక క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అకాడమీలో శిక్షణ పొందు తున్న బాల బాలికలు ఉత్సాహ ంగా యోగా వేడుకల్లో పాల్గొని యోగాసనాలు వేశారు. గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఈ కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు తమ లక్ష్యాల సాధనకు యోగా ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. యోగాను ప్రతీ ఒక్కరూ జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రాచీన భారతీయ వారసత్వ సంపద యోగా ప్రపంచానికి గొప్ప సాధనంగా ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు రాజారావు, సీ హెచ్ రమణ, కె. రమణ, నూకరాజు, ప్రభు, భీమా, వార్డ్ టీడీపీ నాయకులు గాంధీ, వెంకటేష్, లక్ష్మణ్, కిరణ్ పాల్గొన్నారు.




WANTED REPORTERS

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

రెండు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుని ప్రజల గొంతుకై కొనసాగుతున్న మనం తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి తెలుగు భాషపై పట్టున్నవారు సంప్రదించగలరు..

కావలసిన జిల్లాలు

విశాఖపట్నం , అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు

పైన పేర్కొన్న జిల్లాలకు వాటి పరిధిలోని మండలాలకు రిక్రూట్మెంట్ జరుగుతుంది.

ఆసక్తి కలవారు సంప్రదించగలరు

విలేకరులు కావలెను (కాంటాక్ట్ ఇమీడియెట్లీ)

ఎం.వి.ఎస్.జి. తిలక్, ఉత్తరాంధ్ర రీజినల్ బ్యూరో చీఫ్

e-mail id : journalist.tilak03@gmail.com

సంప్రదించాల్సిన నెంబరు : 94945 24365


# హక్కుల కోసం పోరాటమే శరణ్యం



**విజయనగరం , జూన్ 21 ( మనం న్యూస్ ) :** విజయనగరంలోని ఎన్జీవో హోంలో ఆదివారం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓపీడీఆర్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు డా.జతిన్ మాట్లాడుతూ, ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాటమే శరణ్యమన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. సంస్థ నివేదికను కె.సుబ్బారెడ్డి చదివి వినిపిం చారు. ఆ సంస్థ జిల్లా ప్రతినిధులు ఎ.సదాశివరావు, నాయుడు, నరసింహారెడ్డి లు మాట్లాడుతూ, గిరిజన గ్రామీణ పట్టణ పేద ప్రజల సమస్యలు పరిష్కరించాల న్నారు. భూ స్వామ్య దందాలను అరికట్టాలన్నారు. పేదవాడికి విద్య, వైద్యం అందించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు కె.వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీఎస్ఎన్ మూర్తి, జి.సత్యనారాయణ, డి.ఈశ్వరరావు, ఎస్.చిరంజీవి, జీఎస్ రాజు, కె.రాంబాబు, ధనుంజయ్‌కుమార్, శరత్‌కుమార్, ఎస్వీ పైడిరాజు, కె.సత్యం, సీహెచ్ పైడిపల్లి వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.